

అట్టహాసంగా..

సీఎం స్టాలిన్ జన్మదిన వేడుకలు

రాష్ట్రపతి, ప్రధాని సహా నేతల శుభాకాంక్షలు ● కుటుంబ సభ్యుల నడుమ కేక్ కటింగ్



కుటుంబ సభ్యుల నడుమ సతీమణి దుర్గాస్టాలిన్ సమేతంగా కేక్ కట్ చేస్తున్న స్టాలిన్

చెన్నై, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ 71వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణుల నడుమ స్టాలిన్ కేక్ కట్ చేశారు. పార్టీ ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయం ప్రాంగణం శుక్రవారం వేకువజామునే స్టాలిన్‌కు శుభాకాంక్షలు తెలిపేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన కార్యకర్తలతో కిటకిటలాడింది. శుక్రవారం ఉదయం స్టాలిన్ తన ఇంట్లో తండ్రి కరుణ చిత్రపటానికి పూలమాల వేశారు. కుటుంబ సభ్యులతో కలిసి కేక్ కట్ చేశారు. సతీమణి దుర్గాస్టాలిన్, తనయుడు ఉదయనిధి, కుమార్తె సెందామరై, సోదరి కనిమొళి ఆయనకు కేక్ తినిపించారు. ఆ తర్వాత ఇంటి నుంచి కారులో బయలుదేరి మెరీనాబీచ్ చేరుకున్నారు. మాజీ సీఎంలు అన్నాదురై, కరుణ సమాధులపై మంత్రివర్గ సభ్యులు, పార్టీ నాయకులతో కలిసి పుష్పాంజలి ఘటించారు. అక్కడి నుండి వేప్పేరికి బయలుదేరి పెరియార్ స్మారక స్థలాన్ని సందర్శించారు.



అన్నా అరివాలయం వద్ద స్టాలిన్‌కు శుభాకాంక్షలు తెలిపేందుకు బారులు తీరిన పార్టీ కార్యకర్తలు

ఈ సందర్భంగా ద్రావిడ కళగం నేత కె.వీరమణి స్టాలిన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆయా కార్యక్రమాల్లో మంత్రులు దురైమురుగన్, కేఎన్ నెహ్రూ, ఐ.పెరియసామి, పీకే శేఖర్‌బాబు, ఎం. సుబ్రమణ్యం, ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం, అన్బిల్ మహేష్, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్ ప్రియ, ఎంపీలు టీఆర్ బాలు, ఎ.రాజా తదితరులు పాల్గొన్నారు. ఆ తర్వాత అన్నా అరివాలయానికి చేరుకుని వివిధ జిల్లాల నుంచి వచ్చిన పార్టీ ప్రముఖులు, కార్యకర్తల శుభాకాంక్షలు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు కానుకలు అందించారు. పార్టీ శ్రేణుల మధ్య నిలిచి భారీ కేక్‌ను కట్ చేసి అందరికీ కేక్‌లను పంచిపెట్టారు.




కనిమొళి నివాసగృహంలో తల్లి రాజాత్తి అమ్మాళ్ ఆశీస్సులందుకుంటున్న స్టాలిన్

శుభాకాంక్షలు వెల్లువ...

ముఖ్యమంత్రి స్టాలిన్ 71వ జన్మదినం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్రమోదీ సహా వివిధ రాజకీయ పార్టీల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రపతి వెలువరించిన సందేశంలో... స్టాలిన్ సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజలకు నిర్విరామ సేవలందించాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ప్రధాని మోదీ... దీర్ఘాయుష్షుతో సంపూర్ణ ఆరోగ్యంతో తమిళనాడు ప్రజలకు సేవలందించాలని పేర్కొన్నారు. కేరళ సీఎం పినరాయి విజయన్ శుభాకాంక్షలు తెలుపుతూ... రాజ్యాంగ ధర్మాసనం, ప్రజా స్వామ్యరక్షణకు స్టాలిన్ సాగిస్తున్న నిర్విరామ పోరాటం తనకు జ్ఞప్తికి వస్తోందని, సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో రాజకీయ పరంగా మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నానని పేర్కొన్నారు. ఉప రాష్ట్రపతి జగదీప్ ధనకర్, తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, ఎల్ మురుగన్, బీహార్ నాయకులు అఖిలేష్ యాదవ్, తేజస్విని యాదవ్, పుదుచ్చేరి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, బీజేపీ రాష్ట్ర తలఅధ్యక్షుడు అన్నామలై, పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, మక్కల్ నీదిమయ్యం చీఫ్ కమలహాసన్, తమిళగ వెట్రి కళగం అధినేత, సినీ నటుడు విజయ్, న్యాయజస్టిస్ పార్టీ అధ్యక్షుడు ఏసీ షణ్ముగం జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు. అన్నా అరివాలయం వద్ద ఎండీఎంకే నేత వైగో, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుందగై, టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షులు కేఎస్ అళగిరి, కేవీ తంగబాలు, కాంగ్రెస్ ఎంపీ ఎస్ తిరునావుక్కరసు, పుదుచ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి, తమిళగ వాళ్వురిమై కట్చి నేత వేల్‌మురుగన్, సీపీఐ నేత ముత్తరసన్, సీపీఎం నేత బాలకృష్ణన్ తదితరులు స్టాలిన్‌ను శాలువలతో సత్కరించారు.

పరందూరు విమానాశ్రయంలో
మూడు టెర్మినళ్లు

రూ.32,704 కోట్లతో ఎయిర్‌పోర్ట్ నిర్మాణం ● ముమ్మరంగా స్థలసేకరణ ● 2026లో నిర్మాణ పనుల ప్రారంభం



చెన్నై, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లా పరందూరులో రూ.32,704 కోట్ల తో రెండో విమానాశ్రయం నిర్మించేందుకు రంగం సిద్ధమైంది. ప్రస్తుతం ఈ విమానాశ్రయానికి పరందూరు, ఏకనాపురం సహా 20 గ్రామాల్లో స్థల సేకరణ ముమ్మరంగా జరుగుతోంది. ఇటీవల స్థల సేకరణకు సంబంధించిన నోటీసుల ప్రకటనలను పత్రికల్లో వెలువరించారు. నాలుగు దశల్లో పనులు చేపట్టనున్నారు.

నాలుగు దశలు...

తొలిదశ నిర్మాణ పనులు 2026 జనవరిలో ప్రారంభమై 2028 డిసెంబర్‌లో ముగియనున్నాయని అధికారులు చెబుతున్నారు. 5300 ఎకరాల్లో నిర్మించనున్న ఈ విమానాశ్రయంలో మూడు టెర్మినళ్లు ఉంటాయి. 2036లోగా కొత్త విమానాశ్రయం పూర్తిస్థాయిలోకి అందుబాటులోకి వస్తుందని, యేడాదికి 10 కోట్ల మంది ప్రయాణించేందుకు అనువుగా ఉంటుందని అధికారులు తెలిపారు. మొదటి టెర్మినల్ 3,45,758 చదరపుటడుగులు, రెండో టెర్మినల్ 4,75,915 చదరపుటడుగులు, మూడో టెర్మినల్ 5,05,495 చదరపుటడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. ఈ విమానాశ్రయంలో అతి పొడవైన రెండు రన్‌వేలు ఉంటాయని, అంతర్జాతీయ స్థాయిలో పచ్చదనాన్ని పెంచి పోషించే రీతిలో ఈ నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు.

చెన్నైకి చేరుకున్న పారా మిలటరీ బలగాలు

● లోక్‌సభ ఎన్నికలకు పటిష్ఠ భద్రత



అడయార్, మార్చి 1: రానున్న లోక్‌సభ ఎన్నికల కోసం పటిష్ఠ భద్రతా చర్యల కోసం కేంద్ర రక్షణ బలగాలైన పారా మిలటరీ బలగాలు చెన్నైకి చేరుకున్నాయి. మొత్తం 15 కంపెనీల బలగాలు శుక్రవారం నగరానికి వచ్చాయి. కేంద్ర ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలను చేపడుతోంది. ఇందులోభాగంగా, రాష్ట్రంలో కట్టుదిట్టమైన భద్రతా చర్యల కోసం మొత్తం 200 మిలటరీ కంపెనీల పారామిలటరీ బలగాలను వినియోగించనుంది. తొలి విడతగా 25 కంపెనీల బలగాలు రానున్నాయి. వీటిలో 15 కంపెనీల బలగాలు బెంగళూరు నుంచి రైలు ద్వారా నగరానికి చేరుకున్నాయి. ఒక కంపెనీలో 90 మంది చొప్పున కేంద్ర బలగాలు ఉంటాయి. వీరిని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్వహణ అధికారులు ఇతర జిల్లాలకు పంపించేలా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా శనివారం కూడా మరికొన్ని బలగాలు ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి చేరుకోనున్నాయి. కోయంబత్తూరు జిల్లాలో పొల్లాచ్చి, కోయంబత్తూరు లోక్‌సభ స్థానాలున్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో పారామిలటరీ బలగాలు భద్రతా విధుల్లో పాల్గొంటాయని జిల్లా కలెక్టర్ క్రాంతికుమార్ వెల్లడించారు. కొచ్చిన్ నుంచి దాదాపు 500 మందితో కూడిన ఐదు కంపెనీలు శుక్రవారం ఉదయం కోయంబత్తూరుకు చేరుకున్నాయి. ఇదిలా ఉండగా, ఎన్నికల బందోబస్తు చర్యల్లో స్థానిక పోలీసులు, హోంగార్డులు, మాజీ సైనికులు, పారా మిలటరీ బలగాలు, పదవీ విరమణ పొందిన పోలీసులు పాల్గొంటారని ఈసీ అధికారులు తెలిపారు.

అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యే ఇంట్లో
ఏసీబీ తనిఖీలు





ఏసీబీ అధికారులు తనిఖీ జరిపిన నివాసగృహం (ఇన్‌సెట్‌లో)మాజీ ఎమ్మెల్యే ప్రభు

చెన్నై, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కళ్లకురిచ్చి నియోజకవర్గం అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యే ప్రభు నివాసగృహం, ఆయన కంపెనీల్లో అవినీతి నిరోధక విభాగం అధికారులు తనిఖీలు నిర్వహించారు. 2016-21 మధ్య ఆయన ఎమ్మెల్యేగా ఆదాయానికి మించి అక్రమంగా ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. రాష్ట్రంలోనే కాకుండా కర్ణాటకలో ప్రభు కొన్ని కంపెనీలు నడుపుతున్నారు. ఆయన తండ్రి అయ్యప్ప, తల్లి తయ్యల్‌నాయకి... త్యాగదుర్గం నగర పంచాయతీ అధ్యక్షులుగా పనిచేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుకు అన్నాడీఎంకే అధిష్ఠానం సీటివ్వలేదు. దీంతో దినకరన్ నాయకత్వంలోని అమ్మామక్కల్ మున్నేట్ర కళగంలో చేరి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఆ ఎన్నికల తర్వాత ఆయన మళ్లీ అన్నాడీఎంకేలో చేరారు. ఈ నేపథ్యంలో ప్రభుపై పలు అవినీతి ఆరోపణలు రావడంతో ఏసీబీ అధికారులు శుక్రవారం వేకువజాము ఆయన ఇల్లు, కంపెనీల్లో ఒకే సమయంలో తనిఖీలు జరిపారు. ప్రభు తల్లిదండ్రులకు చెందిన ఇంట్లో కూడా తనిఖీలు కొనసాగాయి.



జీతాల కోసం....

● మద్రాస్ వర్శిటీ అధ్యాపకులు, ఉద్యోగుల ధర్నా

అడయార్, మార్చి 1: మద్రాసు విశ్వవిద్యాలయానికి చెందిన 37 బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసిన ఆదాయపు పన్ను శాఖకు వ్యతిరేకంగా శుక్రవారం వర్శిటీ ఉద్యోగులు, సిబ్బంది విధులు బహిష్కరించి ధర్నా చేశారు. ఈ వర్శిటీ రూ.424 కోట్ల ఆదాయపన్ను చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచిన కారణంగా గత నెల 6న గత వర్శిటీ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసింది. దీంతో వర్శిటీ అధ్యాపకులు, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు వేతనం, పెన్షనర్లకు పింఛన్ సొమ్మును పంపిణీ చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఐటీ శాఖ అధికారులు వైఖరిని ఖండిస్తూ యూనివర్శిటీ ప్రాంగణంలో అధ్యాపకులు, సిబ్బంది బైఠాయించి ఐటీ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అలాగే, నెలసరి వేతనాలు తక్షణం విడుదల చేయాలని, అలాగే, 2017 నుంచి రాష్ట్ర ప్రభుత్వం నుంచి వర్శిటీకి అందాల్సిన రాయితీ నిధులను వెంటనే విడుదల చేయాని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో 500 మందికిపైగా సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ ఆందోళనపై వర్శిటీ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు బాలకృష్ణన్ మాట్లాడుతూ... తాము చేపట్టిన నిరసన కార్యక్రమానికి వర్శిటీ తాత్కాలిక ఉద్యోగులు, సిబ్బంది కూడా సంఘీభావం తెలిపారని, తమ సమస్యను పరిష్కరించకుంటే త్వరలోనే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

'బొంగరం' గుర్తు కేటాయించండి

హైకోర్టును ఆశ్రయించిన ఎండీఎంకే ● ఈసీకి నోటీసుల జారీ





ప్యారీస్, మార్చి 1: లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీకి బొంగరం గుర్తును కేటాయించేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ మద్రాస్ హైకోర్టులో ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి, లోక్‌సభ సభ్యుడు వైగో పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని విచారణకు స్వీకరించిన హైకోర్టు.. వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని ఈసీకి ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది. వైగో దాఖలు చేసిన పిటిషన్‌లో... 1996 నుంచి అసెంబ్లీ, లోక్‌సభలకు జరుగుతున్న ఎన్నికల్లో క్రమం తప్పకుండా తమ పార్టీ పోటీ చేస్తోందనీ, ఆ ఎన్నికల్లో తమకు ఎన్నికల సంఘం బొంగరం గుర్తును కేటాయించిందని తెలిపారు. 2006లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 5.99 శాతం ఓట్లు పొందామని, అయినప్పటికీ తమ పార్టీ గుర్తింపును ఎన్నికల సంఘం రద్దు చేసింద న్నారు. ఆ తర్వాత 2014లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో తమకు బొంగరం గుర్తు కేటాయించిందన్నారు. అందువల్ల వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కూడా బొంగరం గుర్తును కేటాయించాలని ఈసీకి లేఖ రాశామని, దీన్ని పరిగణనలోకి తీసుకుని తమకు గుర్తును కేటాయించేలా ఈసీని ఆదేశించాలని వైగో తన పిటిషన్‌లో పేర్కొన్నారు. శుక్రవారం ఈ పిటిషన్‌పై న్యాయమూర్తులు ఎస్.ఎస్.సుందర్, జి.అరుణ్ మురుగన్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది అజ్మల్‌ఖాన్, ఈసీ తరఫున నిరంజన్, రాజగోపాలన్ హాజరై తమ వాదనలు వినిపించారు. అనంతరం ఎండీఎంకే పిటిషన్‌పై వారం రోజుల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఈసీకి హైకోర్టు నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణను ఈనెల 7వ తేదీకి వాయిదా వేసింది.

ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షలు
ప్రారంభం

● 7,72,200 మంది హాజరు

● పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు



తమకు కేటాయించిన గది వివరాలను తెలుసుకుంటున్న విద్యార్థులు

చెన్నై, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు, పుదుచ్చేరి వ్యాప్తంగా ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. 3,302 కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షలకు 7,72,200 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరయ్యారు. ఈ రెండు రాష్ట్రాల్లో 7,534 పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులతో పాటు ప్రైవేటు విద్యార్థులున్నారు. ఇందులో 3,58,201 మంది విద్యార్థులు, 4,13,998 మంది విద్యార్థినులు, హిజ్రా ఉన్నారు. ఇందులో 21,875 మంది ప్రైవేటు వ్యక్తులు, 125 మంది ఖైదీలు కూడా ఉండడం విశేషం. ఇందులో పుళల్ సెంట్రల్ జైలు నుంచే 29 మంది ఖైదీలు పరీక్షలు రాస్తుండడం విశేషం. ఇదిలా ఉండగా పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.15 గంటల వరకు సాగుతుండగా విద్యార్థులు ఉదయం 9 గంటలకే కేంద్రాలకు చేరుకున్నారు. అక్కడే తమ ఇష్టదైవాలను తలచుకుంటూ తమ సబ్జెక్టులను నెమరువేసుకుంటూ, తమ గదులను అన్వేషించుకుంటూ కేంద్రాల్లోకి వెళ్లారు. కాగా పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. కేంద్రాల వద్ద పోలీసు పహారాతో పాటు, ఉపాధ్యాయులు, విద్యార్థుల కోసం తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా తదితర సదుపాయాలు కల్పించింది. అంతేగాక పరీక్షా కేంద్రాల వద్ద ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా జనరేట్లు కూడా ఏర్పాటు చేసింది. పరీక్షా కేంద్రాల వద్దకు సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలను నిషేధించిన విద్యాశాఖ.. కాపీయింగ్, జవాబు పత్రాలను మార్చుకోవడం తదితర అవకతవకలకు పాల్పడే విద్యార్థులను పట్టుకునేందుకు 3,200 ఫ్లయింగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపింది. వీరే కాకుండా పర్యవేక్షణాధికారులు ఆయా కేంద్రాలకు వెళ్లి ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా మొత్తం 154 కంట్రోల్ కేంద్రాలను కూడా ఏర్పాటు చేశారు. పాఠశాల విద్యాశాఖ ఏర్పాటు చేసిన 154 జవాబుపత్రాల కేంద్రాలు, మరో 101 జవాబు పత్రాల సేకరణ కేంద్రాల్లో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటైంది.

తొలిరోజు ప్రశాంతం

శుక్రవారం తొలిరోజు తమిళ పరీక్ష ప్రశాంతంగా సాగింది. 5వ తేది ఆంగ్లం, 8వ తేది కంప్యూటర్ సైన్స్, బయోకెమిస్ట్రీ, అడ్వాన్స్ తమిళ్, హోం సైన్స్, స్టాటిస్టిక్ తదితర పాఠ్య విభాగాలు, 11వ తేది కెమిస్ట్రీ, అకౌంటెన్సీ, జాగ్రఫీ, 15వ తేది ఫిజిక్స్, కంప్యూటర్ టెక్నాలజీ, 19వ తేది గణితం, జువాలజీ, కామర్స్, 22వ తేది బయాలజీ, బోటనీ, హిస్టరీ పరీక్షలు జరుగనున్నాయి. ఒక్కో పరీక్షకు 4 రోజుల విరామం ఉంటుంది. ఇదిలా ఉండగా ఈ నెల 4వ తేదీ నుంచి ప్లస్‌వన్ పరీక్షలు ప్రారంభమై, 25వ తేదీతో ముగియనున్నాయి. అదే విధంగా టెన్త్ పబ్లిక్ పరీక్షలు ఈ నెల 26వ తేదీన ప్రారంభమై ఏప్రిల్ 8తో ముగియనున్నాయి.



ఓ కేంద్రంలో పరీక్ష రాస్తున్న విద్యార్థినులు

సమాచార దర్శిని

5నుంచి అప్రైజర్ శిక్షణ

ఐసిఎఫ్, మార్చి 1: బంగారు నగల మదింపుదారుల శిక్షణ ఈనెల 5 నుంచి 14వ తేదీ వరకు జరగనుంది. రాష్ట్ర ప్రభుత్వ వృత్తుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరగనున్న శిక్షణ పూర్తి చేసిన వారికి రుణ సహాయాలు, కేంద్రప్రభుత్వ సర్టిఫికేట్ అందజేస్తారు. వివరాలకు నెం. 8668102600/ 8668100181/ 7010143022 /9841336033లలో సంప్రదించవచ్చు.

790 ప్రత్యేక బస్సులు

ఐసిఎఫ్, మార్చి 1: స్థానిక కీలంబాక్కం నుంచి వివిధ ప్రాంతాలకు శని, ఆదివారాల్లో 790 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు రవాణాశాఖాధికారులు తెలిపారు. కోయంబేడు నుంచి నాగపట్టినం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరుకు 140 ప్రత్యేక బస్సులు, అలాగే తిరుప్పూరు, ఈరోడ్డు, కోయంబత్తూరు వంటి పలు ప్రాంతల నుంచి 200 ప్రత్యేక బస్సులు చొప్పున మొత్తం 1130 బస్సులు నడపనున్నారు. టిక్కెట్ బుకింగ్, ఇతర వివరాలకు www.tnstc.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

తిరుమంగళంలో మెట్రో ఫ్లైవోవర్

ఐసిఎఫ్, మార్చి 1: స్థానిక తిరుమంగళంలో మెట్రో రైలు ఫ్లైవోవర్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. షోళింగనల్లూర్ - మాధవరం మెట్రోమార్గంలో 47 కి.మీటర్ల దూరం మెట్రోమార్గం నిర్మిస్తున్నారు. ఇదివరకే ఏర్పాటు చేసిన స్తంభాలపై వంతెన నిర్మాణ పనుల జరుగుతున్నాయి. రెట్టేరి, కొళత్తూర్, విల్లివాక్కంలల్లో బ్రిడ్జి పూర్తి అయినందున పట్టాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తిరుమంగళం, అన్నానగర్ వెస్ట్ వంటి ప్రాం తాల్లో మెట్రోఐలు మార్గం కోసం ఇదివరకే వున్న స్తంభాలపై ఫ్లైవోవర్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

సిడ్కో నగర్‌లో కమ్యూనిటీ హాలు

ఐసిఎఫ్, మార్చి 1: స్థానిక అన్నానగర్ మండలం సిడ్కో నగర్‌లో రూ.2.98 కోట్లతో కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపడుతున్నారు. 94వ వార్డు సిడ్కోనగర్ 4వ మెయిన్‌రోడ్డులో వున్న కమ్యూనిటీ హాలు శిథిలావస్థకు చేరుకోవడంతో ఆ భవనాన్ని కూల్చివేసి కొత్త భవనం నిర్మించేందుకు కార్పొరేషన్ నిధులు కేటాయించింది. టెండర్లు ఆహ్వానించి నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

తగ్గిన పుచ్చకాయల ధర

ఐసిఎఫ్, మార్చి 1: స్థానిక కోయంబేడు మార్కెట్టులో పుచ్చకాయలు, నారింజ పండ్ల ధరలు తగ్గాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, పొరుగు రాష్ట్రాల నుంచి వేసవిలో లభించే పండ్లు ఎక్కువగా దిగుమతి అవుతున్నాయి. పుచ్చకాయలు కిలో రూ.10 - 15, ఆరెంజ్ కిలో రూ.30- 40 మేరకు అందుబాటులో ఉన్నట్లు వ్యాపారులు తెలిపారు.

వెల్లుల్లిదీ అదే బాట...

కోయంబేడు మార్కెట్‌లో వెల్లుల్లి ధర కిలో రూ.150కి తగ్గింది. గత ఏడాది ఉత్పత్తి తగ్గడంతో ధరలు పెరిగాయి. జనవరిలో గరిష్ఠంగా కిలో వెల్లుల్లి రూ.500 వరకు విక్రయమైంది. ప్రస్తుతం దిగుమతులు పెరగడంతో కిలో రూ.150కే విక్రయిస్తున్నట్లు వ్యాపారులు తెలిపారు.

మెట్రో రైలులో 86.15 లక్షల మంది ప్రయాణం

ఐసిఎఫ్, మార్చి 1: చెన్నై మెట్రోరైలులో ఫిబ్రవరిలో 86.15 లక్షల మంది ప్రయాణించారని అధికారులు తెలిపారు. జనవరి కన్నా ఫిబ్రవరిలో 1,51,624 మంది అదనంగా ప్రయాణించారని, మెట్రో రైలు సేవలు ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకూ ఇంతసంఖ్యలో ప్రయాణించలేదని చెన్నై మెట్రోరైలు సంస్థ తెలిపింది.

8న కన్నియాకుమారి జిల్లాకు సెలవు

ఐసిఎఫ్, మార్చి 1: కన్నియాకుమారి జిల్లాకు ఈనెల 8వ తేదీన మహారాత్రిని పురస్కరించుకుని సెలవు ఇస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ ప్రకటించారు. ఈ జిల్లాలో పని చేసే అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు ఆ రోజు పని చేయబోవని, సెలవు రోజును భర్తీ చేసేలా 23న పని చేస్తాయని ప్రకటించారు.

బీమా పథకంలో 10,01,592 మంది లబ్ధిదారులు

ఐసిఎఫ్, మార్చి 1: ముఖ్యమంత్రి విస్తృత వైద్య బీమా పథకంలో 10,01,592 మంది కొత్త లబ్ధిదారులు చేరినట్లు ఆరోగ్యశాఖ పేర్కొంది. ఈ పథకం ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల వరకు ప్రీమియం చెల్లిస్తున్నట్లు పేర్కొంది. ఇప్పటి వరకు 1.44 కోట్ల మంది ఈ పథకంలో లబ్ధి పొందుతున్నారని తెలిపింది. కొత్తగా పథకంలో 33 నెలల్లో 10,01,592 మంది చేరారని తెలియజేసింది.

ముగిసిన గ్రూప్-4 దరఖాస్తుల నమోదు

ఐసిఎఫ్, మార్చి 1: గ్రూప్-4 దరఖాస్తు నమోదు ఫిబ్రవరి 29 తేది గురువారంతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో వీఏఓ, జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, స్టెనో వంటి పోస్టుల భర్తీకి గ్రూప్-4 పరీక్ష జూన్ 9వ తేదీన జరగనుంది. ఈ పరీక్షలకు ఆన్‌లైన్ దరఖాస్తు నమోదు జనవరి 30వ తేదీ నుంచి గురువారం వరకు కొనసాగింది. ఇప్పటి వరకూ 22 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని, దరఖాస్తు నమోదుకు అవకాశం పొడిగించే అవకాశం లేదని అధికారులు తెలిపారు.

అద్దె చెల్లించని దుకాణాల సీజ్

ఐసిఎఫ్, మార్చి 1: దిండుగల్ జిల్లా పళని మురుగన్ ఆలయానికి అద్దె చెల్లించని 19 దుకాణాలను దేవాదాయ శాఖాధికారులు సీజ్ చేశారు. ఈ ఆలయానికి సొంతంగా కొండ దిగువ రోడ్డు, గిరి వీధి, పాళయం వంటి ప్రాంతా ల్లో కాంప్లెక్సులున్నాయి. దుకాణదారులు 2021వ సంవత్సరం నుంచి అద్దె చెల్లించకపోవడంతో అధికారులు నోటీసులు పంపారు. అయినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో 19 దుకాణాలను అధికారులు సీజ్ చేశారు.

ఎండిన వెయ్యి చెరువులు

ఐసిఎఫ్, మార్చి 1: తిరువళ్లూరు జిల్లాలో నీరు లేకపోవడంతో వెయ్యి చెరువులు ఎండిపోయాయి. ఈ జిల్లాలో జలవనరుల శాఖ ఆధ్వర్యంలో 586, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 581 జలాశయాలున్నాయి. పర్యవేక్షణ లేకపోవడంతో ముళ్ల పొదలతో నిండివున్నాయి. ప్రస్తుతం ఈ చెరువులు నీరు లేక ఎండిపోయాయి. ఆక్రమణలు తొలగించి, పూడికతీత చేపటిడే రానున్న వర్షాకాలంలో నీరు నిల్వ ఉంటుందని సంబంధిత గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని కోరారు.

7న వీఐటీలో ఉద్యోగావకాశాల శిబిరం

వేలూరు, మార్చి 1: వేలూరు జిల్లా కాట్పాడిలోని వీఐటీ యూనివర్శిటీలో ఉద్యోగావకాశాల విభాగం, మెకానికల్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 7న వీఐటీ సిల్వర్ జూబ్లీ టవర్‌లో ప్రత్యేక ఉద్యోగాల అవకాశ శిబిరం జరగనుంది. ఇందులో డిప్లొమా ఆఖరి సంవత్సరం విద్యార్థులు కూడా పాల్గొనవచ్చు. ఈ ఇంటర్వ్యూలకు ప్రఖ్యాతిగాంచిన సంస్థలు హాజరుకానున్నాయి. స్టీల్ -1 ఇండియా, టీవీఎస్ ట్రైనింగ్ అండ్ సర్వీసు, రిలయన్స్ డిజిటల్, అల్ట్రాటెక్ సిమెంట్, రాజశ్రీ గ్రూప్స్, ఎమరాల్డ్ తదితర సంస్థలు తరలిరానున్నాయి.

సచివాలయానికి బాంబు బెదిరింపు

● రిటైర్డ్ టీచర్ అరెస్టు

చెన్నై, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో బాంబులు పేలనున్నాయంటూ బెదిరింపు ఫోన్‌కాల్ చేసిన రిటైర్డ్ టీచర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. బాంబు బెదిరింపు కారణంగా సచివాలయం అంతటా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బాంబ్ స్క్వాడ్ సభ్యులు మెటల్ డిటెక్టర్లు, పోలీసు జాగిలాలతో తనిఖీ చేశారు. చెన్నైకి చెందిన ఓ ప్రైవేటు టీవీ ఛానల్‌కు శుక్రవారం ఉదయం 8.30 గంటలకు ఓ వ్యక్తి ఫోన్ చేసి సచివాలయంలో బాంబులు అమర్చి ఉన్నాయని కాసేపట్లో అవి పేలనున్నాయని చెప్పి ఫోన్ కట్ చేశాడు. వెంటనే ఆ ప్రైవేటు టీవీ ఛానల్ నిర్వాహకులు పోలీసు కంట్రోలు రూంకు సమాచారం చేరవేశారు. వెంటనే సచివాలయ భద్రతా దళం, స్థానిక పోలీసులు, బాంబ్ స్క్వాడ్... మెటల్ డిటెక్టర్లు, పోలీసు జాగిలాలతో సుమారు రెండు గంటలపాటు క్షుణ్ణంగా తనిఖీ జరిపారు. చివరకు అది ఉత్తుత్తి బాంబు బెదిరింపేనని నిర్ధరణకు వచ్చారు. ఆ తర్వాత పోలీసులు ప్రైవేట్ టీవీ ఛానెల్ కార్యాలయం నెంబర్‌కు ఫోన్ చేసిన వ్యక్తి ఆచూకీని గుర్తించారు. ఆ బాంబు బెదిరింపు చేసింది కడలూరు జిల్లా నెల్లికుప్పానికి చెందిన రిటైర్డ్ టీచర్ ప్రకాష్ అని వెల్లడైంది. ప్రకాష్ గత కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతూ చెన్నైలోని వానగరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు ఆయనను అరెస్టు చేసి విచారణ జరుపుతున్నారు.

ప్రైవేట్ స్కూలుకు...

ఇదే విధంగా మాంగాడు ప్రాంతంలోని ప్రైవేటు స్కూలుకు కూడా బాంబు బెదిరింపు వచ్చింది. గుర్తు తెలియని వ్యక్తి ఆ స్కూల్‌కు పంపిన ఈ-మెయిల్ లో కాసేపట్లో స్కూలులో దాచిన బాంబులు పేలుతాయని పేర్కొన్నారు. వెంటనే ఈ విషయాన్ని స్కూలు నిర్వాహకులకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాంబు స్క్వాడ్‌తో వెళ్లి మెటల్ డిటెక్టర్లు, పోలీసు జాగిలాలతో తనిఖీలు జరిపారు. చివరకు అది ఉత్తుత్తి బాంబు బెదిరింపేనని కనుగొన్నారు. బాంబు బెదిరింపు చేసిన వ్యక్తి ఆచూకీని గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.



సచివాలయంలోని మంత్రుల ఛాంబర్ వద్ద మెటల్ డిటెక్టర్లు, పోలీసు జాగిలంతో తనిఖీ జరుపుతున్న బాంబ్‌స్క్వాడ్

ఉన్నతమైనది తల్లిపాత్ర

● జెరియాట్రిక్ ఫౌండేషన్ ఆర్గనైజర్ వీఎస్ నటరాజన్
● ఘనంగా టీఎన్‌ఏవీఎంఎస్‌లో మహిళా దినోత్సవం



అతిథులతో మహిళా సభ నిర్వాహకులు

ప్యారీస్, మార్చి 1: కుటుంబంలో తల్లిపాత్ర ముఖ్యమైనదని ఆమె పాత్ర ఎంత ఎక్కువగా ఉంటే ఆ కుటుంబం అంత ఉన్నతంగా ఎదుగుతుందని జెరియాట్రిక్ ఫౌండేషన్ ఆర్గనైజర్ డాక్టర్ వీఎస్ నటరాజన్ అన్నారు. తమిళనాడు ఆర్యవైశ్య మహిళా సభ (టీఎన్‌ఏవీఎంఎస్) మద్రాస్ యూనిట్ ఆధ్వర్యంలో అన్నాసాలైలోని కాస్మోపాలిటన్ క్లబ్‌లో శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు వాసవీమాత ప్రార్థనా గీతంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఛైర్‌పర్సన్ అనితా రమేష్ కందిమల్లి ఆహ్వానం పలుకగా, గౌరవ కార్యదర్శి కర్లపాటి లక్ష్మీ శశికాంత్, మద్రాస్ యూనిట్ తరపున నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. సీనియర్ సభ్యురాలు విట్టా పద్మప్రీతా సుమంత్ వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ వేడుకల్లో కీల్పాక్ ప్రభుత్వ వైద్య కాలేజీ ప్రొఫెసర్ టి.కళాప్రసాద్, గైనకాలజిస్ట్ కర్పగాంబాల్ సాయిరాం, గైనకాలజిస్ట్, ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ వీవీ అనురాధ పాల్గొని యూరిన్ ఇన్ఫెక్షన్, బ్రెస్ట్ క్యాన్సర్, మెనోపాజ్ సమస్యలపై మహిళల్లో అవగాహన కల్పించేలా పలు సూచనలు ఇచ్చారు. మహిళా సభ్యురాళ్లు కలిసి నిర్వాహకులు అతిథులను శాలువలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

ఎక్స్‌ప్రెస్ అవెన్యూలో 'నయా గాడ్జెట్' స్టోర్



స్టోర్ ప్రారంభోత్సవ దృశ్యం

అడయార్, మార్చి 1: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బహుళ గాడ్జెట్ బ్రాండ్లకు కేరాఫ్‌గా నయా గాడ్జెట్ స్టోర్‌ను రాయపేటలోని ఎక్స్‌ప్రెస్ అవెన్యూ మాల్‌లో శుక్రవారం ప్రారంభించారు. సుమారు 2600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ స్టోర్‌ను నెలకొల్పారు. ప్రపంచంలో బెస్ట్ ఉత్పత్తులుగా పేరుగాంచిన గాడ్జెట్లను దిగుమతి చేసి ఇక్కడ అందుబాటులో ఉంచుతారు. 30 యేళ్లకు పైగా రీటైల్ వ్యాపారంలో కొనసాగుతున్న రాథోడ్ ఫ్యామిలీ అన్ని రకాల బెస్ట్ ఉత్పత్తులను ఒక గొడుగు కిందకు తీసుకురావాలన్న లక్ష్యంలో భాగంగా ఈ స్టోర్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా రూ.5 లక్షలు ధర కలిగిన లగ్జరీ ప్రీమియం బ్రాండ్ మొబైల్ ఫోన్ వెర్టును ఆవిష్కరించినట్లు ఈ స్టోర్ ప్రమోటర్ పదం వెల్లడించారు.

వేలూరులో స్టాలిన్ జన్మదిన వేడుకలు



కానుకలను పంపిణీ చేస్తున్న రమేష్ తదితరులు

వేలూరు, మార్చి 1: డీఎంకే అధ్యక్షుడు, సీఎం ఎంకే స్టాలిన్ 71వ జన్మదిన వేడుకలు వేలూరులోని 21వ డివిజన్ నయగం తరఫున ఆర్‌పీ రమేష్ నేతృత్వంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులకు బిర్యానీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఉప కార్యదర్శి శాంతి, అంబేడ్కర్ ఐటీ వింగ్ కార్యదర్శి ముత్తు, డివిజన్ ప్రతినిధులు ఆనంద శ్రీనివాసన్, గోపాల్, యువజన విభాగ ప్రతినిధి అఖిల్ తదితరులు కూడా పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్మగ్లర్‌పై గూండా చట్టం

అడయార్, మార్చి 1: పదేపదే రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ పోలీసులకు పట్టుబడిన తిరుమలై అనే వ్యక్తిపై నగర పోలీసులు గూండా చట్టం ప్రయోగించారు. ఉత్తర చెన్నైలో రేషన్ బియ్యం అక్రమ రవాణా సాగుతున్నట్టు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో తండయారుపేట, కొరుకుపేట, తిరువొత్రియూరు, వ్యాసర్పాడి, వాషర్‌మెన్‌పేట, ఎంకేబీ నగర్ తదితర ప్రాంతాల్లో పోలీసులు మఫ్టీలో నిఘా సారించారు. తిరుమలై అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా గతంలో పలుమార్లు రేషన్‌బియ్యం రవాణా చేస్తూ పట్టుబడినట్టు తేలింది. దీంతో ఆయనపై గూండా చట్టం ప్రయోగించారు.

రేపు పల్స్ పోలియో

57.84 లక్షల మంది చిన్నారులకు ● 43,051 కేంద్రాల ఏర్పాటు

ప్యారీస్, మార్చి 1: రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 3న 43,051 కేంద్రాల్లో 57.84 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్టు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. రాష్ట్రాన్ని పోలియో రహితంగా తీర్చిదిద్దే క్రమంలో... ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, పౌష్టికాహార కేంద్రాలు, పాఠశాలలు, బస్టాండులు, రైల్వే స్టేషన్లు, పర్యాటక ప్రాంతాలు ఇలా మొత్తం 43,051 కేంద్రాల్లో పల్స్‌పోలియో శిబిరాలు నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఐదేళ్ల లోపుచిన్నారులందరికీ పోలియో చుక్కలు వేస్తారు. ఇటీవల జన్మించిన శిశువులకు ఈ శిబిరాల్లో పోలియో చుక్కలు వేసుకోవచ్చని, 2 లక్షలకుపైగా హెల్త్ వర్కర్లు, ఉపాధ్యాయులు, ఎన్జీవో సంస్థల ప్రతినిధులు అందుబాటులో ఉంటారని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు.

వండలూరులో బాంబులతో దాడి

డీఎంకే నాయకుడి దారుణహత్య



ఆరాముదన్ (ఫైల్ ఫొటో)

చెన్నై, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా వండలూరు సమీపంలో డీఎంకే నాయకుడిని గుర్తు తెలియని వ్యక్తులు నాటు బాంబులతో, వేటకొడవళ్లతో దాడి జరిపి దారుణంగా హత్యచేశారు. వండలూరు సమీపం కాట్టాన్‌కుళత్తూరు నార్త్ డీఎంకే శాఖ కార్యదర్శిగా ఉన్న ఆరాముదన్ గురువారం రాత్రి కారులో ఇంటికి వెళుతూ మార్గమధ్యంలో ఆగి, తన స్నేహితులు ఇద్దరి వద్ద కబుర్లాడుతుండగా కారులో వచ్చిన ఐదుగురు వ్యక్తులు నాటుబాంబులు విసిరారు. ఆ తర్వాత కారు నుంచి దిగి వేటకొడవళ్లతో ఆయనపై దాడి జరిపి మెరుపు వేగంతో పారిపోయారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న ఆరాముదన్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స ఫలించక ఆయన మృతిచెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

ఐదుగురి లొంగుబాటు...

ఇదిలా ఉండగా ఈ హత్యకేసుకు సంబంధించి ఐదుగురు ఈరోడ్ జిల్లా సత్యమంగళం కోర్టులో లొంగిపోయారు. పోలీసుల సమాచారం మేరకు చెన్నై ఓట్టేరికి చెందిన మునీశ్వరన్, మన్నివాక్కానికి చెందిన సత్యశీలన్, అవినాశికి చెందిన సంపత్‌కుమార్, దిండుగల్‌కు చెందిన మణికంఠన్, దినేష్ కోర్టులో లొంగిపోయారు. వారి వద్ద హత్యకు గల కారణాలను తెలుసుకుంటామని పోలీసులు చెప్పారు.

ధైర్యముంటే రాష్ట్రంలో నిర్మలమ్మ పోటీ చేయాలి

మాజీ మంత్రి కేపీ మునుస్వామి సవాల్

అడయార్, మార్చి 1: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ధైర్యముంటే రాష్ట్రంలో నుంచి పోటీ చేయాలని అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి కేపీ మునుస్వామి బహిరంగ సవాల్ విసిరారు. కృష్ణగిరి జిల్లా శూలగిరిలో గురువారం రాత్రి జరిగిన అన్నాడీఎంకే బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగిస్తూ, రాష్ట్రంలో ఎన్ని కుట్రలు పన్నిన అన్నాడీఎంకేను, రెండు కోట్ల మంది కార్యకర్తలను ఏమీ చేయలేరన్నారు. ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు అన్నామలైలు ఇటీవల పల్లడం సభలో లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తామని ప్రకటించారని, అయితే, వారిది పగటి కలగానే మిగిలిపోతుందన్నారు. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్... తమిళనాడు రాష్ట్రంలోని ఏదో ఒక స్థానం నుంచి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి గెలిచి తన శక్తిసామర్థ్యాలను నిరూపించుకోవాలని ఆయన సవాల్ విసిరారు.

లారీ ఢీకొని కాలేజీ విద్యార్థి దుర్మరణం

అడయార్, మార్చి 1: తాంబరం - మదురవాయల్ ఔటర్ రింగ్ రోడ్డులో లారీ ఢీకొనడంతో కాలేజీ విద్యారి దుర్మరణం చెందాడు. మాడంబాక్కానికి చెందిన జగదీశ్వరన్ (20) అనే యువకుడు పోరూర్‌లో ఉన్న ఒక ప్రైవేటు కాలేజీలో డిగ్రీ చదువుతున్నాడు. గురువారం ద్విచక్రవాహనంపై కాలేజీకి బయలుదేరాడు. తాంబరం - మదురవాయల్ ఔటర్ రింగ్ రోడ్డులో వెళుతూ ముందు వెళుతున్న ఆటోను అధిగమించబోయి అదుపుతప్పి కిందపడ్డాడు. ఆ సమయంలో వెనుకనే వస్తున్న లారీ జగదీశ్వరన్‌ను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఆవడి ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. చేతికి ఎదిగిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో మృతుడి తల్లిదండ్రులు భోరున విలపిస్తున్నారు.

నవ వధువు ఆత్మహత్య

అడయార్, మార్చి 1: స్థానిక తిరుముల్లైవాయల్‌లో నవ వధువు ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై ఆర్డీవో విచారణ జరుపుతున్నారు. పోలీసుల కథనం మేరకు.. తిరుముల్లైవాయల్ తెండ్రల్ నగర్‌కు చెందిన సతీష్ అనే భవన నిర్మాణ కార్మికుడికి ఆరు నెలల క్రితం వనిత (19)తో వివాహమైంది. రెండు మూడు నెలల పాటు బాగానే సాగిన వీరి సంసారం.. ఆ తర్వాత మనస్పర్థలు తలెత్తాయి. దీంతో వారిద్దరూ నిత్యం ఘర్షణపడుతూ వచ్చారు. దీంతో తీవ్ర మనస్థాపానికిలోనైన వనిత ఇంట్లోనే ఉరేసుకుంది. సమాచారం అందుకున్న తిరుముల్లైవాయల్ పోలీసులు కేసు నమోదు చేసి, శవపరీక్ష కోసం మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆత్మహత్యపై పోలీసులు సహా ఆర్డీవో విచారణ జరుపుతున్నారు.

కొలరాడో స్టేట్ వర్శిటీతో 'శ్రీరామచంద్రా' ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న రెండు వర్శిటీల నిర్వాహకులు

చెన్నై, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూరులోని శ్రీరామచంద్రా ఉన్నత విద్యా పరిశోధన సంస్థ (డీమ్డ్ వర్శిటీ) అమెరికాలోని కొలరాడో స్టేట్ యూనివర్శిటీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. శుక్రవారం మధ్యాహ్నం శ్రీరామచంద్రా వర్శిటీ ఆడిటోరియంలో ఏర్పాటైన కార్యక్రమంలో వర్శిటీ వీసీ డాక్టర్ ఉమాశేఖర్, కొలరాడో స్టేట్ వర్శిటీ ప్రెసిడెంట్ డాక్టర్ ఆమీ పార్సన్స్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమాశేఖర్ మాట్లాడుతూ... ఈ ఒప్పందం ప్రకారం రెండు విశ్వవిద్యాలయాలు సంయుక్తంగా ఇంజనీరింగ్, బయోమెడికల్ సైన్సె స్, పబ్లిక్ హెల్త్, మెడికల్ మైక్రోబయాలజీ పాఠ్యాంశాల్లో ఉమ్మడి కోర్సులు, పరిశోధనలు నిర్వహించనున్నామని చెప్పారు. రెండు వర్శిటీలకు చెందిన విద్యార్థులు ఈ నాలుగు పాఠ్యాంశాలలో నాలుగేళ్ల కోర్సులను అభ్యసించే అవకాశం కల్పిస్తున్నామన్నారు. నాలుగేళ్ల కోర్సులలో చేరే విద్యార్థులు ఫైనల్ ఇయర్‌ను కొలరాడో విశ్వవిద్యాలయంలో చదవాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామచంద్రావర్శిటీ పరిశోధనల విభాగం డీన్ డాక్టర్ కల్పనా బాలకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

4న కల్పాక్కానికి ప్రధాని



చెన్నై, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 4న కల్పాక్కం అణువిద్యుత్ కేంద్రానికి విచ్చేయనున్నారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రధాని మోదీ రాష్ట్రంలో విరివిగా పర్యటిస్తున్నారు. గత రెండు నెలల్లోనే ఆయన మూడుసార్లు రాష్ట్రంలో పర్యటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్వల్ప వ్యవధిలోనే మోదీ మళ్లీ పర్యటనకు విచ్చేస్తున్నారు. ఈ నెల 4న తెలంగాణలో ఏర్పాటయ్యే కొన్ని కార్యక్రమాల్లో పాల్గొంటున్న మోదీ అక్కడి నుంచి విమానంలో బయలుదేరి చెన్నైకి వస్తారు. చెన్నై విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి కల్పాక్కం అణువిద్యుత్ కేంద్రానికి చేరుకుంటారు. ఆ కేంద్రంలో రూ.400 కోట్లతో ఏర్పాటయ్యే ఇంధన రీసైక్లింగ్ బ్లాస్టర్‌ను ప్రారంభిస్తారు. ఈ బ్లాస్టర్ స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించారు. ఈ కార్యక్రమం ముగిసిన తర్వాత మోదీ హెలికాప్టర్‌లో బయలుదేరి నగరానికి చేరుకుంటారు. విమానాశ్రయం నుంచి కారులో బయలుదేరి నందనం వైఎంసీఏ మైదానంకు చేరుకుంటారు. అక్కడ బీజేపీ ఆధ్వర్యంలో జరిగే బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ప్రధాని రాక సందర్భంగా వైఎంసీఏ మైదానం వద్ద భారీ భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులు వైఎంసీఏ మైదానం వద్ద వేదిక నిర్మాణ ప్రాంతాన్ని తనిఖీ చేశారు. ఆ మైదానం చేరువగా ఏర్పాటవుతున్న హెలిప్యాడ్‌ను పరిశీలించారు. 2న ఉదయం మూడు శాఖలకు చెందిన మూడు హెలికాప్టర్లతో ప్రధాని ప్రత్యేక భద్రతాదళం అధికారులు, స్థానిక పోలీసు ఉన్నతాధికారులు ట్రయల్ రన్‌ను నిర్వహించనున్నారు. మోదీ బహిరంగ సభకు చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాలకు చెందిన వేలాదిమంది పార్టీ కార్యకర్తలు తరలిరానున్నట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి.

పబ్లిక్ ఇష్యూను ప్రకటించిన ఆర్‌కే స్వామి లిమిటెడ్



మీడియాతో సుందర్ స్వామి

అడయార్, మార్చి 1: ఆర్‌కే స్వామి కంపెనీ పబ్లిక్ ఇష్యూను చేయనుంది. ఈ నెల 4వ తేదీ నుంచి ఈ పబ్లిక్ ఇష్యూ ఆఫర్‌ను ప్రకటించింది. రూ.5 ముఖ విలువ కలిగిన ఒక్కో షేర్‌ను రూ.270 నుంచి రూ.288 (షేర్ ప్రీమియం)గా నిర్ణయించింది. ఒక్కొక్కరు కనీసం 50 ఈక్విటీ షేర్‌ల కోసం బిడ్లు వేసుకోవచ్చు. యాంకర్ ఇన్వెస్టర్ బిడ్డింగ్ తేదీ శుక్రవారం నుంచి ప్రారంభంకాగ, బిడ్ లేదా ఆఫర్ సబ్‌స్క్రిప్షన్ ఈనెల 4న సోమవారం నుంచి ప్రారంభమవుతుంది. ఈ పబ్లిక్ ఇష్యూ ద్వారా సేకరించే నిధులను కంపెనీ ఫండింగ్ వర్కింగ్ క్యాపిటల్ అవసరాల కోసం రూ.540 మిలియన్లు, డిజిటల్ వీడియో కంటెంట్ ప్రొడక్షన్ స్టూడియో ఏర్పాటు కోసం కంపెనీ వెచ్చించాల్సిన నిధుల మూలధన వ్యయం రూ.109.85 మిలియన్లు, కంపెనీ ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్‌లో నిధుల పెట్టుబడి, మెటీరియల్ అనుబంధ సంస్థలు, హన్సా రీసెర్చ్ గ్రూపు ప్రైవేట్ లిమిటెడ్, హన్సా కస్టమర్ ఈక్విటీ ప్రైవేట్ లిమిటెడ్ కోసం రూ.333.42 మిలియన్లు, కంపెనీ కొత్త కస్టమర్ అనుభవ కేంద్రాలు (సీఈసీ), కంప్యూటర్ ఎయిడెడ్ టెలిఫోనిక్ ఇంటర్వ్యూ సెంటర్‌ల (సీఏటీఐ) ఏర్పాటుకు రూ.217.36 మిలియన్లు, సాధారణ కార్పొరేట్ ప్రయోజనాలకు వినియోగిస్తారని కంపెనీ నిర్వాహకుల్లో ఒకరైన సుందర్ స్వామి శుక్రవారం నగరంలో జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

హోం లోన్ మేళా ప్రారంభం



మేళాను ప్రారంభిస్తున్న ప్రముఖులు

చెన్నై, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): 'ది కార్పొరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' (క్రెడాయ్) చెన్నై విభాగం ఆధ్వర్యంలో 'హోం లోన్ మేళా' ప్రారంభమైంది. టి.నగర్ విజయమహల్‌లో ప్రారంభమైన ఈ మేళా ఈ నెల 3వ తేదీ వరకు కొనసాగనుంది. దీనిని క్రెడాయ్ ఉపాధ్యక్షుడు ఎస్.శ్రీధరన్, మాజీ అధ్యక్షుడు శివగురునాథన్, ఫెయిర్‌ప్రొ 2024 కన్వీనర్ అస్లం పకీర్ మహమ్మద్, క్రెడాయ్ చెన్నై కార్యదర్శి పి.కృతివాస్ తదితరులు లాంఛనంగా ప్రారంభించారు. ఇదిలా ఉండగా నందంబాక్కంలోని ట్రేడ్‌సెంటర్‌లో ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు 'ఫెయిర్‌ప్రొ 2024' జరగనుందని నిర్వాహకులు తెలిపారు.

ఎస్‌ఆర్‌ఎం డెంటల్ కాలేజీలో స్వీయ పరీక్షలపై ప్రపంచ రికార్డు



కలామ్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ ప్రతినిధుల నుంచి సర్టిఫికేట్‌ను స్వీకరిస్తున్న ఎస్‌ఆర్‌ఎం దంత వైద్యకళాశాల నిర్వాహకులు

చెన్నై, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా కాట్టాన్‌కుళత్తూరులోని ఎస్‌ఆర్‌ఎం దంత వైద్యకళాశాల ఆసుపత్రిలో ఒకే సమయంలో 4 వేలమంది విద్యార్థులకు నోటి క్యాన్సర్‌ను గుర్తించే స్వీయపరీక్షలు నిర్వహించి ప్రపంచ రికార్డు నెలకొల్పారు. ఈ ప్రదర్శనలో 14 నుంచి 21 యేళ్లలోపు వయస్సు కలిగిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రో వైస్‌ఛాన్సలర్లు డాక్టర్ ఎ.రవికుమార్, డాక్టర్ ఎ.వినయకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సామూహిక స్వీయపరీక్షల కార్యక్రమాన్ని కలామ్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో పొందుపరచినట్లు ఎస్‌ఆర్‌ఎం దంతవైద్యకళాశాల నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా ఎస్‌కేపీసీ రజతోత్సవం



రజతోత్సవ ప్రత్యేక సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న సుభాషిణి నారాయణన్‌తో నిర్వాహకులు

ప్యారీస్, మార్చి 1: స్థానిక జార్జిటౌన్‌లోని శ్రీ కన్యకాపరమేశ్వరి కళాశాల (ఎస్‌కేపీసీ) రజతోత్సవ, కాలేజ్‌డేను గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా ఎస్‌కేపీసీ పూర్వ విద్యార్థిని, కౌలాలంపూర్‌లోని భారత రాయబారి సుభాషిణి నారాయణన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ... విద్యార్థినులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని అలాగే, చదువుకున్న కాలేజీకి భవిష్యత్‌లో తమ వంతు సహకారం అందించాలని సూచించారు. పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆమె ఆకాంక్షించారు. కళాశాల గౌరవ కరస్పాండెంట్ ఊటుకూరి శరత్‌కుమార్, ఎస్‌కేపీడీ చారిటీస్ ధర్మకర్త కొల్లా వెంకట చంద్రశేఖర్ సభ్యులు దేశు లక్ష్మీ నారాయణ, ఎస్ఎల్. సుదర్శనం, టీవీ రామకుమార్, సీఆర్ కిషోర్‌బాబు, టి.బద్రీనాథ్, సలహాదారు డాక్టర్ జేవీ రావు, కార్యదర్శి ఎం.కిషోర్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ మోహనశ్రీలతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రైతును చంపిన ఇద్దరికి యావజ్జీవం

అడయార్, మార్చి 1: రైతును హత్య చేసి, మృతదేహాన్ని సాగునీటి కాలువలో విసిరేసిన కేసులో ఇద్దరు నిందితులను దోషులుగా ప్రకటిస్తూ, యావజ్జీవ శిక్ష విధిస్తూ తిరుప్పూరు కోర్టు తీర్పు వెలువరించింది. తిరుప్పూర్ జిల్లాలోని పల్లడం, మందిరిపాళేనికి చెందిన సంపత్‌కుమార్(39), నాదగౌండియన్ పాళెయంకు చెందిన శివసుబ్రమణ్యం మంచి స్నేహితులు. రైతులు కూడా. శివ సుబ్రమణ్యం తన స్కూటర్‌ను సంపత్ కుమార్‌కు తాకట్టుపెట్టి రూ.9 వేలు తీసుకున్నాడు. ఈ వ్యవ హారంలో వారిద్దరి మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. దీంతో 2022 నవంబరు 30వ తేదీ రాత్రి సంపత్ కుమార్‌ను శివసుబ్రమణ్యం తన స్నేహితుడు అభిమన్యుతో కలిసి హత్య చేశారు. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేయగా, తిరుప్పూరు కోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో న్యాయమూర్తి స్వర్ణం నటరాజన్ ఇరుపక్షాల వాదనలు ఆలకించి శివసుబ్రమణ్యం, అభిమన్యులను దోషులుగా నిర్ధరించి వారికి యావజ్జీవ శిక్షను విధిస్తూ గురువారం తీర్పునిచ్చారు.

పాయువులో దాచి స్మగ్గింగ్...బంగారం స్వాధీనం

అడయార్, మార్చి 1: తిరుచ్చి విమానాశ్రయంలో ప్రయాణికులు పాయువులో దాచి తీసుకొచ్చిన కిలో బంగారాన్ని ఎయిర్‌పోర్టు కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ రూ.66.68 లక్షల వరకు ఉంటుందని కస్టమ్స్ తెలిపారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. షార్జా నుంచి చెన్నై ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం తిరుచ్చి విమానాశ్రయానికి బుధవారం వచ్చింది. ఈ విమా నంలో వచ్చిన ప్రయాణికులు బంగారాన్ని అక్రమంగా తీసుకొచ్చినట్టు కస్టమ్స్ అధి కారులకు సమాచారం వచ్చింది. దీంతో ప్రయాణికుల్లో అనుమానాస్పదంగా ఉన్న ఒకరిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, బంగారాన్ని పేస్ట్ (జెల్) రూపంలోకి మార్చి పాయువులో దాచి తీసుకొచ్చినట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

సంగీతంతో పద్మిని సాన్నిహిత్యం



పద్మిని



సంగీత సాధనలో...

- వేళచ్చేరి -

తరుణి

ఆడపిల్లలకు పెళ్లి కోసం కొంచెం నోటి పాట, హార్మోనియం వాయించడం, పద్దులు రాసే పాటి లెక్కలు వస్తే చాలనుకొనే రోజులు పోయాయి.. లింగ భేదం లేకుండా పిల్లలనందరినీ చదివించాలని, ఆడైనా, మగైనా తమ కాళ్ల మీద తాము నిలబడాలన్నది నేటి తల్లిదండ్రుల ఆకాంక్ష. లలిత కళల పట్ల అభిరుచి ఉన్నా కానీ, కనీస విద్యార్హతలు సంపాదించిన పిదపే ఆసక్తులను పండించు కోవాల్సిందిగా తల్లిదండ్రులు పిల్లలకు హితవు పలుకుతున్నారు. ఆ కోవకు చెందిన వారే ఆమె తల్లిదండ్రులు. బాల్యంలోనే ఆమె సంగీతాభిరుచిని గమనించిన తల్లి దండ్రులు, సంగీతంలో శిక్షణ ఇప్పిస్తూనే, చదువులో ఒక స్థాయికి చేరుకొనేదాక దానికే ప్రాముఖ్య తనివ్వాలని ఆదేశించారు. వారి కోరికను మన్నించిన ఆమె డిగ్రీ పూర్తిచేసిన పిదపనే తనకు ఇష్టమైన సంగీతం అభివృద్ధి చేసికొని ప్రావీణ్యం సంపాదించారు... సంగీతాన్నే వృత్తిగా స్వీకరించారు. ఆమే నేటి మన 'తరుణి' పద్మిని. బాల్యం నుంచి సంగీతంతో సాన్నిహిత్యం ఉన్నా ఆ ప్రవృత్తిని వృత్తి దిశగా మలచుకొన్న పద్మిని జీవన ప్రస్థానం ఇదీ....

సంగీతంపై అభిరుచి...

తండ్రి వైపు వారిలో ఎందరో సంగీతజ్ఞులు ఉండడమే కాక, తండ్రి స్వయంగా మృదంగ విద్వాంసులు. అంతేకాదు, మంచి గాయకుడు కూడా. గాత్రం ఘంటసాల మాస్టారు లాగా ఉందని అందరూ ప్రశంసించేవారట. తండ్రి పాటల అభిరుచి పద్మినికి కూడా అబ్బింది. తండ్రి పాటలు వింటూ, తాను పాటలు పాడడడం అభ్యాసం చేసేది. ఆమెకు గానంపై ఉన్న మక్కు వను గమనించిన తల్లిదండ్రులు ఇంటి వద్దే సంగీత గురువును ఏర్పాటుచేసి సంగీతంలో శిక్షణ ఇప్పించారు. వారికి సంగీతాభిరుచి ఎంత ఉన్నా వారి ప్రథమ ప్రాధాన్యం చదువుకే. అందుకే చదువుకే ముఖ్య భూమికనిచ్చి, విరామ సమయంలో ఇంటి వద్దే సంగీతాభాస్యం చేస్తూ డిగ్రీ పూర్తి చేశారు పద్మిని. ఆపైన తన అభిరుచికి అగ్రతాంబూలమిస్తూ మెడ్రాస్ మ్యూజిక్ అకాడమీలో చేరి 3 సంవత్సరాల కోర్సును పూర్తి చేశారు. సమాంతరంగా దూరవిద్య ద్వారా ఎమ్.కాం., చదివి డిగ్రీ సాధించారు. సంగీతంలో గాత్ర సంగీత ఉపాధ్యాయురాలిగా శిక్షణ పొందారు. అంతేకాదు, కెనడాలోని వెస్ట్రన్ కిండర్ మ్యూజిక్ టీచర్స్ ట్రైనింగ్ కోర్సు కూడా పూర్తి చేశారు.

పుట్టింది ఆంధ్రలో...

పద్మిని ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో జన్మించారు. తల్లి వరలక్ష్మీ, తండ్రి బొమ్మిరెడ్డిపల్లి సన్యాసి రావు. ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేసేవారు. పద్మిని పెరిగింది, స్థిరపడింది చెన్నైలోనే. చెన్నైలోని జైన్ స్కూలులో పాఠశాల చదువు పూర్తిచేసి జైన్ కాలేజీ నుంచే బి.కామ్ డిగ్రీ తీసుకున్నారు. ఆపై దూర విద్య ద్వారా ఎమ్.కామ్ డిగ్రీ పొందారు.

సంగీతం వికసించింది ఇలా....

వివాహానికి ముందే ఆమె కర్ణాటక సంగీతం, భక్తి సంగీతం, లలిత సంగీత ప్రదర్శనలు ఇచ్చేవారు. చెన్నైలోని వివిధ దేవాలయాల్లో పర్వ దినాలలో తన గాత్రంతో భక్తులను పరవశింపజేశారు. క్రమేణా స్టేజీ షోలు, వివాహ ఫంక్షన్లలో తన గాత్రాన్ని వినిపించారు. ముఖ్యంగా మైలాపూర్‌లోని సాయిబాబా మందిరంలో పలుమార్లు భక్తి సంగీతంతో శ్రోతలను ముగ్ధులను చేశారు. నేటికీ దేవాలయాల్లో పర్వదినాల్లో తన విద్యార్థులతో కలసి శాస్త్రీయ సంగీత ప్రదర్శనలు ఇస్తూ శ్రోతలను అలరిస్తున్నారు.

సంగీత ఉపాధ్యాయురాలిగా...

కోట్టూరుపురంలోని అన్నా జెమ్ స్కూలులో 9 సంవత్సరాలు మ్యూజిక్ టీచర్‌గా సేవలందించారు. ఆపైన ఎన్నో సంవత్సరాలుగా పలు పాఠశాలల్లో సంగీతోపాధ్యాయినిగా పనిచేసిన అనుభవం ఆమెది. ప్రస్తుతం సరస్వతీ విద్యాలయలో పార్ట్ టైం మ్యూజిక్ టీచర్‌గా చేస్తూ కోట్టూరుపురంలో 'అన్వయా స్కూల్ ఆఫ్ మ్యూజిక్ ఎడ్యుకేషన్' స్థాపించి సంగీతంలో శిక్షణ నిస్తున్నారు. 3 సంవత్సరాల వయసు చిన్నారులు నుంచి ఎందరో ఆమె వద్ద సంగీతాభ్యాసం చేస్తున్నారు. అడయార్‌లో ఒక అకాడమీలో వారానికి రెండు రోజులు సంగీతం క్లాసులు నిర్వహిస్తారు. కర్ణాటక సంగీతంతో పాటు, శ్లోకాలు, భజనలు, చిన్న చిన్న గీతాలు నేర్పిస్తూ విద్యార్థుల్లో సంగీతం పట్ల అభిరుచిని పెంపొందిస్తున్నారు. పద్మినికి సంగీతంలో ప్రావీణ్యంతో పాటు హార్మోనియం, వయొలిన్ వాద్యాలలో ప్రవేశం ఉంది.



ఆలయ వేడుకల్లో గీతాలాపన చేసిన విద్యార్థులతో...

ప్రేరణ, ప్రోత్సాహం...

ఆమె స్థాపించిన మ్యూజిక్ స్కూలులోని విద్యార్థులకు శాస్త్రీయ సంగీతంలో శిక్షణ ఇస్తూ వారికి ప్రేరణ, ప్రోత్సాహం కలిగించేందుకు చెన్నైలోని ఎన్నో ఆలయాల్లో కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆమె విద్యార్థులు కొందరు జి.తమిళ్ ఛానల్‌లో పాటల కార్యక్రమానికి ఎంపికయ్యారు. మైలాపూర్‌లోని సాయిబాబా మందిరంలో, నేపథ్య గాయకుడు జి.ఆనంద్ (కే.శే.) గారితో కలసి ఎన్నో పర్యాయాలు భక్తి సంగీత ప్రదర్శనలివ్వడం మరచిపోలేని అనుభూతిగా ఆమె తెలిపారు.



విద్యార్థులతో కలసి గానం చేస్తూ...





సంగీత దర్శకుడు శంకర్ (గణేశ్) నేతృత్వంలో గానం చేస్తూ.. - నేపథ్యగాయకులతో

బోధన పద్ధతులు...

పాఠశాలల్లో మ్యూజిక్ టీచర్‌గా ఉన్న ఆమె సంగీత శిక్షణ కొంచెం విలక్షణంగా ఉంటుంది. కేవలం శాస్త్రీయ సంగీతమే నేర్పిస్తుంటే పిల్లల్లో ఆసక్తి తగ్గే అవకాశముందని భావించిన ఆమె, పిల్లల ఇష్టాలకు అనుగుణంగా చిన్నచిన్న పాటలు, దేశభక్తి గీతాలు, లలిత గీతాలు కూడా నేర్పిస్తుంటారు. వెస్టన్ మ్యూజిక్‌లో కూడ శిక్షితురాలు కావడం వలన ఇంగ్లీషు రైమ్స్ సందర్భాన్ననుసరిచి నేర్పించడం ఆమె బోధనా పద్ధతి.

అభిరుచులు...

పద్మినికి సంగీతంతో బాటు గ్లాస్ పెయింటింగ్ పట్ల అభిరుచి ఉంది. అంతే కాదు, దాన్లో నైపుణ్యం సాధించి కొన్ని చోట్ల పెయింటింగ్ తరగతులు కూడా చేపడుతున్నారు. సాయిబాబా భక్తురాలైన ఆమెకు బాబా డ్రెస్సులు, కిరీటాలు కూడా తయారుచేసి సాయిబాబా గుళ్లల్లో ఇవ్వడం పరిపాటి.



కుటుంబసభ్యులతో...

కుటుంబం...

పద్మిని భర్త శరవణన్. ఈ దంపతులకు ఒక కుమార్తె.

సంగీతం నేర్చుకొనే విద్యార్థులు తప్పనిసరిగా కచేరీలకు వెళ్లాలి. విద్వాంసుల బాణీని శ్రద్ధగా పరిశీలించాలి. సంగీతం ఒత్తిడిని తగ్గించి ప్రశాంతతను చేకూరుస్తుంది. నిబద్ధతతో, శ్రద్ధతో సంగీతాన్ని అభ్యసించి, సాధన చేస్తే ఎన్నో ప్రయోజనాలు సొంతం అవుతాయి

- పద్మిని

ఐదేళ్ల తర్వాత....



ఆర్థన బిను

'తొండన్' సినిమా ద్వారా కోలీవుడ్‌కు పరిచయమైన ఆర్థన బిను.. ఐదేళ్ల తర్వాత మళ్లీ వెండితెరపై కనిపించనున్నారు. ఆమె హీరోయిన్‌గా నటించిన 'వాస్కోడగామా' చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకురానుంది. కార్తీ హీరోగా వచ్చిన 'కడైకుట్టి సింగం' చిత్రంలో కార్తీ మరదలుగా నటించిన ఆర్థన బిను... ఆ తర్వాత తెలుగు, తమిళ చిత్రాల్లో నటిస్తూ వచ్చారు. 'తొండన్' చిత్రం ద్వారా తమిళ వెండితెరకు హీరోయిన్‌గా పరిచయమయ్యారు. ఆమె చివరగా 'వెన్నిలా కబడి కుళు'లో నటించారు. ఈ సినిమా 2019లో విడుదలైంది. ఈ సినిమా తర్వాత ఆమె 'వాస్కోడగామా'లో నటించారు. ఇందులో హీరో నకుల్. త్వరలోనే ఈ మూవీ ప్రేక్షకుల ముందుకురానుంది. ఆర్‌జీ కృష్ణన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కేఎస్ రవికుమార్, మన్సూర్ అలీఖాన్, మునీష్‌కాంత్, రెడిన్ కింగ్‌స్లీ తదితరులు నటించారు. వాంజినాథన్ ఛాయాగ్రహణం అందించగా, అరుణ్ సంగీత స్వరాలు సమకూర్చారు.

బాలా వేధించలేదు

● మమిత బైజు



కోలీవుడ్ ప్రముఖ దర్శకుడు బాలా తనను కొట్టడం వల్ల ఆ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నట్టు వస్తున్న వార్తలపై మలయాళ నటి మమిత బైజు స్పందించారు. బాలా తనను కొట్టలేదని, అసత్యాలు ప్రచారం చేయొద్దని ఆమె కోరారు. అరుణ్‌విజయ్ హీరోగా బాలా దర్శకత్వంలో 'వణంగాన్' పేరుతో ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో మమిత బైజును హీరోయిన్‌గా ఎంపిక చేశారు. అయితే, ఇందులో నటిస్తుండగా, దర్శకుడు బాలా ఓ పాటను చిత్రీకరణ సమయంలో ఒక వాయిద్య పరికరాన్ని వాయిస్తూ నృత్యం చేయాలని మమితను కోరగా, ఆమె పలు టేక్‌లు తీసుకున్నారని, దీంతో ఆగ్రహించిన దర్శకుడు ఆమె వీపుపై కొట్టినట్టు వార్తలు వస్తున్నాయి. వీటిపై మమిత బైజు వివరణ ఇచ్చారు. 'బాలా నాపై చేయి చేసుకున్నట్టుగా వస్తున్న వార్తల్లో రవ్వంత కూడా నిజం లేదు. వాస్తవాలు తెలుసుకోకుండా దుష్ప్రచారం చేయొద్దు. 'వణంగాన్' చిత్రం ప్రీపొడక్షన్ పనులకు ముందు నుంచే బాలాతో కలిసి పనిచేస్తున్నా. నన్ను మంచి నటిగా తీర్చిదిద్దేందుకు ఆయన కృషి చేస్తున్నారు. ఈ సినిమా షూటింగ్‌లో బాలా నుంచి శారీరకంగాను, మానసికంగానూ ఎలాంటి వేధింపులు ఎదురుకాలేదనే విషయాన్ని మరోమారు స్పష్టం చేస్తున్నా' అని పేర్కొన్నారు.

అధర్వ - అదితి జంటగా వినోదాత్మక చిత్రం

చిత్రజ్యోతి

యువ హీరో అధర్వ మురళి, అదితి శంకర్ జంటగా ఫుల్‌లెంగ్త్ ఎంటర్‌టైనర్ తెరకెక్కనుంది. శ్రీవారి ఫిలిమ్స్ పతాకంపై నిర్మాత పి.రంగనాథన్ నిర్మించే 'ప్రొడక్షన్ నెం.1' మూవీకి ఎం.రాజేష్ దర్శకుడు. కెమెరా సుకుమారన్, సంగీతం శ్యామ్ సీఎస్. ఈ సినిమా గురించి హీరో అధర్వ మాట్లాడుతూ... 'చిత్ర పరిశ్రమలో ఎంతో అనుభవం ఉన్న నిర్మాత రంగనాథన్‌తో కలిసి పనిచేయడం సంతోషంగా ఉంది. నాణ్యమైన వినోదాత్మక కథలను ఎంచుకోవడం, వాటికి విస్తృత ప్రచారం కల్పించడంలో నిర్మాతకు అనుభవం అపారం. న్యూ ఏజ్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకునే ఈ చిత్రం ప్రేక్షకులను ఏమాత్రం నిరాశపరచదు' అని అన్నారు. దర్శకుడు రాజేష్ మాట్లాడుతూ.. 'కాలంతో పాటు జోనర్ కూడా మారిపోతోంది. కానీ, తమిళ ప్రేక్షకులు ఎంటర్‌టైనర్ మూవీలను ఎల్లవేళలా ఆదరిస్తూనే ఉన్నారు. ప్రేక్షకులు ఎంజాయ్ చేసేలా ఒక సినిమాకు దర్శకత్వం వహించే అవకాశం కల్పించిన నిర్మాతకు ధన్యవాదాలు' అని అన్నారు. నిర్మాత రంగనాథన్ మాట్లాడుతూ... 'ఎన్నో ఏళ్ళుగా సినిమా డిస్ట్రిబ్యూటర్‌గా, నిర్మాతగా కొనసాగుతున్నా. ఎన్నో వినోదాత్మక చిత్రాలను తెరకెక్కించా. ఇపుడు కూడా థియేటర్‌కు వచ్చే ప్రేక్షకులు రెండు మూడు గంటల పాటు హాయిగా నవ్వుకునేలా మంచి వినోదాత్మక చిత్రాన్ని తెరకెక్కించేందుకు శ్రీకారం చుట్టా' అని పేర్కొన్నారు.



అధర్వ, అదితి, రాజేష్, రంగనాథన్

హన్సిక ద్విపాత్రాభినయంతో 'గాంధారి'



దర్శకుడు ఆర్.కన్నన్ డైరెక్షన్‌లో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'గాంధారి'. హన్సిక మొత్వానీ ప్రధాన పాత్రలో ద్విపాత్రాభినయం చేశారు. మసాలా పిక్స్ బ్యానరుపై కన్నన్ స్వీయ నిర్మాణంలో తెరకెక్కుతోంది. ప్రస్తుతం చివరి దశ నిర్మాణ పనులను జరుపుకుంటోంది. వేసవి సెలవుల్లో విడుదల చేయనున్నారు. ఈ సినిమా గురించి దర్శకుడు కన్నన్ మాట్లాడుతూ... 'హిందూ దేవాదాయ శాఖలో పరిశోధకురాలిగా పనిచేసే ఒక యువతి... కొన్నేళ్ల క్రితం ఓ రాజు నిర్మించిన గంధర్వకోటలో అధ్యయనం చేసేందుకు వెళతారు. ఆ కోటలో నిధుల కోసం అన్వేషణ చేస్తుండగా, అనేక ఆశ్చర్యకర విషయాలు వెలుగుచూస్తాయి. అవి ఏమిటి అన్నదే ఈ చిత్ర కథ? ఎన్నో మలుపులతో ఉత్కంఠభరితమైన కథాంశంతో తెరకెక్కిస్తున్నాం. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా రూపొందించే ఈ సినిమాలో హన్సిక తొలిసారి ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ఈ సినిమా కోసం ఆమె కొంత శిక్షణ కూడా తీసుకున్నారు. ఈ సినిమా కోసం చెన్నై ఈసీఆర్‌లో రూ.60 లక్షల తో సెట్‌ను నిర్మించి, అక్కడ 1943లో జరిగే ఫ్లాష్‌బ్యాక్ సన్నివేశాలను చిత్రీకరించాం. ఇందులో మెట్రో శిరీష్, తలైవాసల్ విజయ్, స్టంట్ సెల్వ, వినోదిని, భవన్, వడివేల్ మురుగన్, కలైరాణి తదితరులు ఇతర పాత్రలను పోషించారు. కెమెరా బాలసుబ్రమణ్యం, సంగీతం ఎల్‌వీ ముత్తు గణేష్ సమకూర్చుతున్నారు' అని పేర్కొన్నారు.

రూ.3.56 కోట్లతో ఉపాధ్యాయులకు వైద్య బీమా

● మంత్రి అన్బిల్ మహేశ్



శిబిరంలో మంత్రులు అన్బిల్ మహేష్, సుబ్రమణ్యం తదితరులు

ప్యారీస్, మార్చి 1: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల సంక్షేమార్థం రూ.3.56 కోట్లతో వైద్య బీమా పథకాన్ని అమలు చేయనున్నట్టు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేశ్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తూ 50 యేళ్ల దాటిన 36,600 మంది ఉపాధ్యాయులకు రూ.3.56 కోట్లతో మాస్టర్ హెల్త్ చెకప్ పథకాన్ని శుక్రవారం నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి అన్బిల్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులను ఉన్నతవంతులుగా తీర్చిదిద్దేందుకు శ్రమిస్తున్న ఉపాధ్యాయుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రతి యాడేళ్ళకోసారి మాస్టర్ హెల్త్ చెకప్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 1,06,985 మంది టీచర్లు 50 యేళ్ల దాటారని, 73,349 మంది టీచర్లు 40-50 యేళ్లలోపువారని, 43,701 మంది టీచర్లు 40 యేళ్లలోపువారన్నారు. వీరిలో తొలివిడతగా 50 యేళ్ల దాటిన ఉపాధ్యాయులకు మాత్రం యేడాదికి ఒకసారి మాత్రం ఫుల్ బాడీ చెకప్‌కు అనుమతిస్తూ, గత నెల 13వ తేదీన ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. ఈ జీవో ప్రకారం రక్తహీనత, ఈఎస్ఆర్, బ్లడ్ షుగర్, యూరియా, యూరిక్ యాసిడ్, కొలెస్ట్రాల్ తదితర వైద్య పరీక్షలను చేస్తామన్నారు.

పోలీస్ ఆస్పత్రిలో హోంగార్డులకు చికిత్స

● ప్రారంభించిన కమిషనర్



ప్యారీస్, మార్చి 1: స్థానిక ఎగ్మోరులోని పోలీస్ ఆస్పత్రిలో హోం గార్డులకు వివిధ రకాలైన వైద్య చికిత్సలను అందించనున్నట్టు గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్ వెల్లడించారు. నగరంలో ఉన్న శాంతిభద్రతలు, ట్రాఫిక్, భద్రతా విభాగాల పోలీస్ స్టేషన్లకు చెందిన పోలీసులు శాంతిభద్రత పనుల పర్యవేక్షణలో పాల్గొంటున్నారన్నారు. వీరితో పాటు హోంగార్డు విభాగానికి చెందిన 2,329 మంది పనిచేస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశాల మేరకు, పోలీస్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన వైద్య చికిత్స విభాగాన్ని శుక్రవారం కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పోలీస్ ఆస్పత్రిలో హోం గార్డులకు అన్ని రకాల వైద్య చికిత్సలు అందుబాటులో ఉంటాయని, అదేవిధంగా పోలీస్ బజార్‌లో సరకుల పంపిణీ చేసే పథకం త్వరలోనే అమలు చేస్తామన్నారు. దీనికి సంబంధించిన గుర్తింపు కార్డులను కూడా వారికి వారం రోజుల్లో అందిస్తామన్నారు ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కపిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● చమురు తెట్టు నుంచి విముక్తి

ఎన్నూరుతీరంలో ఎగిరిన గూడబాతులు



ఎన్నూరు సముద్రం ముఖద్వారం వద్ద గూడబాతును విడిచిపెడుతున్న అధికారులు



చెన్నై, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మిచౌంగ్ తుఫాను సందర్భంగా మణలి ఆయిల్ కర్మాగారం నుంచి వెలువడిన వ్యర్థాల వల్ల సముంద్రంలో ఏర్పడిన చమురు తెట్టులో చిక్కుకుని కొన ఊపిరితోకొట్టుమిట్టాడిన 10 గూడ బాతులను చికిత్సలందించిన తర్వాత అధికారులు వాటిని మళ్లీ ఎన్నూరు సముద్రం ముఖద్వార ప్రాంతంలో విడిచిపెట్టారు. ఆ గూడ బాతులు తమకు చికిత్సలందించిన వెటర్నరీ, ఫారెస్ట్ అధికారులను విడిచి వెళ్లేందుకు మనసురాక అదే చోట చక్కర్లు కొట్టాయి. అధికారులు వాటిని పడవలలో తీసుకెళ్ళి ఎన్నూరు సముద్రం ముఖద్వారం వద్ద విడిచిపెట్టారు. ఆ తర్వాత ఆ గూడబాతులు ఎగురుకుంటూ వెళ్లాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యావరణ శాఖ కార్యదర్శి సుప్రియా సాహు కూడా పాల్గొన్నారు.

స్టాలిన్‌కు శుభాకాంక్షల వెల్లువ





స్టాలిన్‌కు పుస్తకాన్ని బహూకరిస్తున్న టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై, డీపీఐ అధినేత తిరుమా తదితరులు

ముఖ్యమంత్రి స్టాలిన్ జన్మదినం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పార్టీ కార్యర్తలు సహా నాయకులు ఆయనకు బహుమతులు అందించారు. అలాగే వివిధ పార్టీల అధినేతలు శుభాకాంక్షలు తెలిపారు.



మెరీనాబీచ్‌లోని మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి సమాధి వద్ద నివాళి అర్పిస్తున్న స్టాలిన్







స్టాలిన్‌ను సత్కరిస్తున్న ఎండీఎకే అధినేత వైగో, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.ముత్తరసన్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణన్ తదితరులు



స్టాలిన్‌కు కానుకలు తీసుకొచ్చిన పార్టీ కార్యకర్తలు